క్లుప్తంగా

రేపు శివాలయంలో సమీక్ష

కూసుమంచి: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని కూసుమంచి శివాలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆలయంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కాముని శ్రీకాంత్ తెలిపారు. ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పీజీటీ ఫలితాల్లో భార్గవరామ్ ప్రతిభ


భార్గవరామ్

ఖమ్మం అర్బన్: ఇటీవల ప్రకటించిన పీజీటీ ఫలితాల్లో ఖమ్మం మండలం రోటరీనగర్‌కు చెందిన రాచర్ల భార్గవరామ్ ప్రతిభ కనబరిచారు. ఈమేరకు ఆయన రాష్ట్రస్థాయిలో 26వ ర్యాంకు సాధించి ఇంగ్లిష్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆయన ఎంఏ, బీఈడీ, పీజీసీటీ, బీఎల్ఐఎస్సీ పూర్తిచేయగా, తల్లిదండ్రులు రాచర్ల సంగమేశ్వరరావు – రాధికతో పాటు పలువురు అభినందించారు.

కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేశ్‌రెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 30వ డివిజన్‌లో బాదె జ్యోతి సమక్షంలో సత్యమార్గం ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాధు రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఉచిత కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ ఉదయ్, తల్లాడ రమేశ్, కల్వకుంట్ల గోపాల్, బోడేపూడి రాజా, మంగ, భరత్, శివ, మహేశ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం..


పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠశాల బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని బుధవారం ప్రారంభించినట్లు పాఠశాల బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంత సైక్షనిక్ ప్రముఖ నల్లానుచక్రవర్తుల కృష్ణమాచార్యులు, ప్రాంత శిశువాటిక ప్రముఖ కోవెల శ్రీనివాసరావు, ఖమ్మం విభాగ కార్యదర్శి వేముల సుబ్బారావు, దేవసీ వాసుదేవరావులు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ వారు పుస్తకమిత్ర కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన పుస్తకాలతో గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సంతోష గౌతమ్, వినోభా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ట్రూ లవర్
వినోద	అంబాజీ పేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	యాత్ర 2
ఆదిత్య	లాల్ సలామ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	22	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	56	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	56	చుక్కకూర	3
బీర	56		20
దొండ	48	తోటకూర	2
పొట్లకాయ	48		10
చిక్కుడు	50	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	58		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

కొత్త కొలువులెన్నడో ?



కార్పొరేషన్‌ను వేధిస్తున్న ఉద్యోగుల కొరత
- ఏళ్ల నాటి పోస్టులతోనే నెట్టుకొస్తున్న వైనం
- ఆ పోస్టుల్లోనూ చాలా వరకు ఖాళీలే..
- ఫలితంగా ఉన్న ఉద్యోగులపై పని భారం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్‌ను ఉద్యోగుల కొరత వేధిస్తోంది. మున్సిపాలిటీగా ఉన్న సమయాన కేటాయించిన పోస్టులతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నారు. 2011 జూన్‌లో జీఓ 218 ప్రకారం వివిధ విభాగాలకు 158 మంది ఉద్యోగులు, సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఆ పోస్టులే నేటికీ కొనసాగుతున్నాయి. ఈ పోస్టుల్లో కూడా పూర్తిస్థాయి ఉద్యోగులు, సిబ్బంది లేరు. నాడు మున్సిపాలిటీగా ఉండగా.. నేడు నగర పాలక సంస్థగా ఎదిగినప్పటికీ నియామకాలు చేపట్టకపోవడం గమనార్హం. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న ఖమ్మం పురపాలక సంస్థను 2012 అక్టోబర్‌లో ప్రభుత్వం నగర పాలక సంస్థగా ప్రకటించింది. విలీన గ్రామపంచాయతీలను కలుపుకుని 60 డివిజన్లతో ఖమ్మం కార్పొరేషన్ రోజురోజుకు విస్తరించడంతో పాటు అభివృద్ధిలో ముందుకెళ్తుంది. ఈ క్రమంలో సిబ్బంది కొరత కారణంగా కార్పొరేషన్‌లో ప్రజా సేవలతో పాటు అభివృద్ధి పనులు, పర్యవేక్షణ, ఆదాయంపై ప్రభావం పడుతుంది.

పనులపై ప్రభావం..

ఖమ్మం కార్పొరేషన్‌గా మారిన తర్వాత ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్, జనన, మరణ ధ్రువీకరణ, శానిటేషన్ విభాగాలపై పని భారం పెరిగింది. ఆయా విభాగాల నుంచి నిత్యం పౌర సేవలను కొనసాగించాల్సి ఉంది. ప్రతిరోజు అనేక రకాల పనులపై ఆయా విభాగాలకు వస్తున్న నగర వాసులకు సేవలందించేందుకు సరిపడా సిబ్బంది లేక పనులు వాయిదా వేసే పరిస్థితి వస్తుంది. ఇంజనీరింగ్ విభాగంలో సరిపడా అధికారులు, సిబ్బంది లేక నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించే పరిస్థితి లేకుండా పోతుంది. ఇక టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్మాణ అనుమతులు ఆలస్యం అవుతుండడంతో అనుమతులు లేకుండానే ఇళ్లను నిర్మిస్తున్నారు. పారిశుద్ధ్య విభాగంలో సిబ్బంది కొరతతో ఉన్నవారిపై పని భారం పడుతుంది.

కేఎంసీలోని కొన్ని విభాగాల్లో మంజూరు పోస్టులు, ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల వివరాలిలా..

పోస్టు	కావాల్సిన పోస్టులు	మంజూరైనవి	ప్రస్తుతం పనిచేస్తున్న వారు
అడిషనల్ కమిషనర్	01	01	00
డిప్యూటీ కమిషనర్	02	02	00
సెక్రటరీ	01	01	00
సీనియర్ అసిస్టెంట్స్	18	12	06
జూనియర్ అసిస్టెంట్స్	18	05	13
బిల్ కలెక్టర్	26	13	13
ఎస్ఈ	01	01	00
ఏఈ	13	08	05
సిటీ ప్లానర్	01	01	00
డీసీపీ	02	02	00
ఏసీపీ	04	02	02
టీపీఎస్	07	04	03
టౌన్ సర్వేయర్	02	02	00

మున్సిపల్ నాటి పోస్టులే..

ఖమ్మం పురపాలక సంఘంగా ఉన్న నాటి పోస్టులతోనే ప్రస్తుతం కార్యాలయ పరిపాలనను నెట్టుకొస్తున్నారు. ఖమ్మం మున్సిపాలిటీకి 158 పోస్టులు మంజూరు కాగా.. వాటిని కూడా పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు. కేవలం 79 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక ఔట్ సోర్సింగ్‌లో 1,009 మంది విధులు నిర్వర్తిస్తుండగా శానిటేషన్ విభాగంలో 731 మంది పని చేస్తున్నారు. శానిటేషన్‌లో మరో 100 మంది వరకు సిబ్బంది అవసరం ఉంది. ఉన్న వారితోనే శానిటేషన్, ఇతర పనులు చేయిస్తున్నారు. ఇక రెగ్యులర్ పోస్టుల్లో పబ్లిక్ హెల్త్ వర్కర్ల పోస్టులు 170 ఉండగా 95 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 75 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ప్రతీ విభాగంలో ఒకటి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

బదిలీలు.. సన్మానాలు..

◆ రఘునాథపాలెం ఎంపీడీఓగా అశోక్..

రఘునాథపాలెం: రఘునాథపాలెం ఎంపీడీఓగా వి.అశోక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీఓగా ఉన్న రామకృష్ణ బదిలీ కాగా ఆయన స్థానంలో అశోక్ చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సూపరింటెండెంట్ జానివియా, ఏఈ చిరంజీవి, ఉపాధి హామీ పథకం ఏపీఓ పద్మయ్యనాయుడు, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ నేలకొండపల్లి ఎంపీడీఓకు సన్మానం..

నేలకొండపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ ఎం.జమలారెడ్డిని, సూర్యాపేట జిల్లా నుంచి నేలకొండపల్లి ఎంపీడీఓగా బదిలీపై వచ్చిన ఎంపీడీఓ యర్రయ్యను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుధవారం జమలారెడ్డికి వీడ్కోలు సమావేశం నిర్వహించగా.. యర్రయ్య పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, నాయకులు, ప్రజాప్రతినిధులు వారిరువురిని సన్మానించగా.. జమలారెడ్డి మాట్లాడారు. బదిలీలు సహజమేనని, కానీ చేసిన పనులే మంచి గుర్తింపునిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఈజీఎస్ ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు బైరం దినేశ్ కుమార్, దేవేందర్, మహేశ్ పాల్గొన్నారు.

◆ కూసుమంచి సీఐగా జనార్దన్, ఎస్సైగా కిరణ్‌కుమార్..

కూసుమంచి: కూసుమంచి నూతన సీఐగా బి.జనార్దన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జితేందర్‌రెడ్డిను బదిలీ చేసి ఐజీ కార్యాలంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ కాగా.. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న జనార్దన్‌ను నియమితులయ్యారు. ఆయనతో పాటు కూసుమంచి నూతన ఎస్సైగా ఎ.కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రమేశ్‌కుమార్‌ను టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. నూతన సీఐ, ఎస్సైలకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

◆ ట్రాఫిక్ సీఐగా మోహన్‌బాబు..

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ సీఐగా సత్తుపల్లి సీఐగా పనిచేస్తున్న మోహన్‌బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన అశోక్ బదిలీ కాగా ఆయన స్థానంలో మోహన్‌బాబు వచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

◆ బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సీఐలు..

ఖమ్మంక్రైం: ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ -1, స్టేషన్-2 సీఐలుగా కృష్ణ, చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1 సీఐగా పనిచేసిన రాజు, ఖిల్లా వరంగల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖిల్లా వరంగల్ నుంచి చంద్రమోహన్ వచ్చారు. అదేవిధంగా ఎక్సైజ్ స్టేషన్-2 సీఐగా పనిచేస్తున్న రాజిరెడ్డి మణుగూరు బదిలీ కాగా, ఆయన స్థానంలో మహబూబాబాద్‌లో పనిచేస్తున్న కృష్ణ నియమితులయ్యారు. వీరిద్దరు జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

◆ తిరుమలాయపాలెం ఎస్సైగా గిరిధర్‌రెడ్డి..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ఎస్సైగా గిరిధర్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై వరాల శ్రీనివాస్ ఖమ్మం వీఆర్‌కు బదిలీ కాగా గిరిధర్‌రెడ్డిని తిరుమలాయపాలెంకు బదిలీ చేశారు. ఈ మేరకు గిరిధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

◆ నేలకొండపల్లి ఎస్సైగా నాగరాజు..

నేలకొండపల్లి: నేలకొండపల్లి ఎస్సైగా తోట నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నేలకొండపల్లి ఎస్సైగా పని చేసిన బి.సతీశ్ ఖమ్మం త్రీటౌన్‌కు బదిలీ చేయగా.. ఖమ్మం టూటౌన్‌కు చెందిన నాగరాజును నేలకొండపల్లి ఎస్సైగా బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించగా.. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై నాగరాజు సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గౌస్‌పాషా

ఖమ్మంక్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ డీటీఓ గౌస్‌పాషా అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రతా మాసోత్సవాలలో వివిధ రూపాల్లో నెల రోజుల పాటు ప్రజలు, వాహనదారులకు భద్రతా ప్రమాణాలపై అవగాహన కలిపించినట్లు తెలిపారు. అదే విధంగా ఆయన హెల్మెట్లు, సీటు బెల్ట్ వలన కలిగే ఉపయోగాలు, ఓవర్ స్పీడ్ వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం వారోత్సవాల ముగింపు కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వరప్రసాద్, ఏఓలు జాహిద్‌అలీ, సుధాకర్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని సోలీపురం ఆశా కార్యకర్త విజయలక్ష్మి కుటుంబానికి ఐఎన్టీయూసీ హెచ్-1 యూనియన్ తరపున వైద్య సిబ్బంది రూ.15వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బుధవారం సోలీపురంలో విజయలక్ష్మి కుటుంబాన్ని వైద్య సిబ్బంది పరామర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ వి.కృష్ణారావు, సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వసుంధర, యూనియన్ సెక్రటరీ డి.ధనలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ శివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్, ట్రెజరర్ సందీప్, ఈసీ మెంబర్ రామకష్ణ, మాధవి, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, మేరీ, ఉమా ఆశా కార్యకర్త నాగలక్ష్మి, జ్యోతి సూపర్‌వైజర్స్ ఉపేందర్, దేవయ్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంద్రానికి గ్రామంలో పని చేసే వివిధ శాఖల ఉద్యోగులు ఫ్యాన్, కుర్చీలు, పలకలు, వాటర్ క్యాన్‌లను బుధవారం అంగన్‌వాడీ టీచర్ బచ్చలకూరి నిర్మలకు వితరణగా అందించారు. ఈనేపథ్యాన గ్రామ ఉద్యోగులు చిన్నారులకు ఉపయోగపడేలా వస్తువులు అందించినందుకు గాను నిర్మల ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మంకెనపల్లి నాగేశ్వరరావు, సరికొండ పణిభూషణ్, చపల్లపాటి వెంకటేశ్వర్లు, బచ్చలకూరి నాగరాజు, మార్తి కోటి, వెంకటరామయ్య, భూచక్రవర్తి, మహబూబాపాషా, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న ఉద్యోగులు

ఘనంగా తిరుపతమ్మతల్లి నగర సంకీర్తన


నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మతల్లి నామస్మరణతో మార్మోగింది. బుధవారం గ్రామంలో గురుస్వామి పమ్మి గోపి ఆధ్వర్యాన తిరుపతమ్మ నగర సంకీర్తన(జ్యోతి) కార్యక్రమాన్ని నిర్వహించగా.. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శివశక్తులు, తిరుపతమ్మ మాలధారులు తిరుపతమ్మతల్లి, గోపయ్య స్వామి పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అనంతరం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రాంబాబు, బోల్లు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రాజేశ్, కంపసాటి కృష్ణ, పెరుగు అచ్చయ్య, కొమ్ము రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

'స్మార్ట్ కిడ్జ్'లో.

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్యలు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'తెలంగాణ నారాయణ'లో

నగరంలోని వీడీవోస్ కాలనీలో గల తెలంగాణ నారాయణ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖరావు, కొదుమూరు నాగపవన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు జ్ఞాన సరస్వతి దేవి పూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ నారాయణలో అక్షరాభ్యాసం

టాలెంట్ టెస్టులో 'న్యూవిజన్' ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో చైర్మన్ ప్రసాద్

ఖమ్మం సహకారనగర్: రెండు తెలుగు రాష్ట్రాలకు జరిగిన ఏఎస్ రావు సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ ఫైనల్ లెవల్‌లో న్యూవిజన్ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాలలో 1, 2, 4, 5వ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యుత్తమ బోధన వల్లే మంచి ర్యాంక్‌లు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్.కార్తీక్, ప్రిన్సిపాల్ మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి దేశవ్యాప్త సమ్మెకు సహకరించండి

హామీలు అమలు చేయమంటే దాడులా..?


ఆందోళన చేస్తున్న అఖిల పక్షం నాయకులు

తిరుమలాయపాలెం: న్యాయమైన రైతాంగ హక్కులకై పోరాడుతున్న రైతులపై మిలటరీ భాష్పవాయువులను ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని, బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళన చేస్తుంటే వాటిని పరిష్కరించకపోగా దాడులు చేయడం దారుణమని అఖిల పక్ష నాయకులు ఆరోపించారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మందడి ఇజ్రాయిల్, సీపీఎం జిల్లా నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తక్షణమే మోడీ ప్రభుత్వం రైతులతో చర్చలు జరిపి రైతాంగ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీసీసీబీ, గ్రామీణ వికాస బ్యాంక్ మేనేజర్లను, మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్‌లను కలిసి బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా జిల్లా నాయకుడు కమ్మకోటి నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగిరేకుల నరసయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి వశపొంగు వీరన్న, చీమ లక్ష్మయ్య, లింగయ్య, పల్లె మల్లయ్య, టీకుమట్ల బాబు, నూకతొట్టి సాల్మన్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేత..


సమ్మె నోటీస్ అందిస్తున్న పంచాయతీ వర్కర్లు, నాయకులు

రఘునాథపాలెం: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ వి.అశోక్‌కుమార్‌కు పంచాయతీ వర్కర్లు, నాయకులు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా సమ్మెను విజయవంతానికి సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల మల్లయ్య, జిల్లా నాయకులు రాందాస్, మండల అధ్యక్షుడు బానోత్ మంగీలాల్, మండల కార్యదర్శి మేళ్లచెరువు రాజగోపాల్, మండల ఉపాధ్యక్షుడు సీతారాములు, జాటోత్ బద్రు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యాన విస్తృత ప్రచారం..



ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ ప్రభుత్వ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16వ తేదీన శుక్రవారం దేశవ్యాప్త సమ్మెతో పాటు నిర్వహిస్తున్న బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని సహకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ పిలుపునిచ్చారు. బుధవారం రేవతిసెంటర్‌లోని రిలయన్స్ మాల్‌లో బంద్‌పై ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు బంద్ రోజు విధులకు హాజరు కావొద్దని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఖమ్మం నగరంలో వ్యాపారం చేస్తున్న చిన్న, పెద్ద వ్యాపారస్తులు బంద్‌కు పూర్తి సహకారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, భద్రం, నారపోగు నాగేశ్వరరావు, మల్లికార్జున్ రెడ్డి, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అడుగంటిన ఆనవాళ్లు..!

రోడ్డు విస్తరణలో భాగంగా మండల ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించిన చేతిపంపు ఆనవాళ్లు అడుగంటాయి. రఘునాథపాలెంలోని మండల కార్యాలయాల కాంప్లెక్స్‌కు ఎదురుగా వేసిన చేతి పంపు పలువురికి దాహాన్ని తీర్చుతున్న నేపథ్యాన ఇలా అడుగంటడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి సమీపాన తహసీల్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు ఐకేపీ, ఎంఈఓ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిపోయే వారికి దగ్గరలో తాగు నీటి వసతి లేదు. దీంతో కిలోమీటర్ల దూరం వెళ్లి దాహం తీర్చుకోవాల్సి వస్తుంది. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు చేతిపంపు ఎత్తు పెంచి ఉపయోగపడేలా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- రఘునాథపాలెం

